క్లుప్తంగా

సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్: మహాలక్ష్మి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీహెచ్‌సీ (రైతులకు వ్యవసాయ పని ముట్లు అద్దెకు ఇచ్చే కేంద్రం) సెంటర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అడ చంద్రకళరాజు అన్నారు. సోమవారం గాదిగూడ మండల కేంద్రంలోని మహాలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యోగేష్, సర్పంచ్ మెస్రం జైవంతరావు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న స్వచ్ఛంద సంస్థలు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలుకా కోపెల గ్రామానికి చెందిన మున్నిబేగం అనే వృద్ధురాలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకుని స్వచ్ఛంద సంస్థల సభ్యులు వృద్ధురాలికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజొద్దీన్, ఉపాధ్యక్షుడు మహ్మద్ ఖాలిద్ అహ్మద్, ఇమ్రాన్ ఖాన్, తబ్రేజ్ ఖాన్, హాఫిజ్ సమీర్, ఇంతెఖాబ్ ఆలం, అజీజ్, ఇస్తెఖార్, ప్రమోద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలి

బేల: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని బేల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కోల నర్సింలు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, నిర్వహణ, కమ్యూనిటీ వలంటీర్స్ అనుబంధంపై అవగాహన కల్పించారు. సీడీపీవో నర్సమ్మ, సూపర్‌వైజర్‌లు సుజాత, అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'మహిళలకు రక్షణ కరువు'

ఇంద్రవెల్లి: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చిత్రటానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ యాసలో మాట్లాడే భాషను వక్రీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. బీజేపీ జిల్లా నాయకుడు జైస్వాల్ శివకుమార్, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్ షేకవత్, ఆరెల్లి రాజలింగు, మోరే దిలీప్, మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్, నాఫెడ్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరాంనాయక్, మారుతి డోంగ్రె, మహ్మద్ అంజద్, ఆశా బాయి, స్వర్ణలత పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

ఇంద్రవెల్లి: ఈనెల 15 నుంచి 29 వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్ రాథోడ్ శ్రావణ్ అన్నారు. సోమవారం మండలంలోని లీంగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. 608 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

బోథ్: మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ అతికొద్దీన్ సోమవారం పరిశీలించారు. ఈ నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.

'విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు'

కైలాస్‌నగర్: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుతో సంబంధం లేకుండా ప్రతీ విద్యార్థికి హాల్ టికెట్లు అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రైవేట్ కళాశాలలు హాల్‌టిక్కెట్ ఇవ్వకుండా విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తే సహించేది లేదన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే ఏఐఎస్ఎఫ్ నాయకులను సంప్రదించాలని కోరారు.

బోథ్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫీజుతో సంబంధం లేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా, ప్రధాన కార్యదర్శి గెడం కేశవ్‌లు పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ కళాశాలలో ఫీజు కట్టనిదే హాల్ టికెట్‌లు ఇవ్వడం లేదన్నారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

ఆదిలాబాద్‌టౌన్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న రిమ్స్ ఆస్పత్రిలో రోగులకు, చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రిమ్స్‌లో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి పాల్గొన్నారు.

ఆయకట్టుపై ఆశలు

- మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో నీటి విడుదల
- నీటి వృథాను అరికట్టేలా చర్యలు
- తుది దశకు చేరుకున్న మత్తడివాగు కుడి కాలువ పనులు
- కొనసాగుతున్న ట్రయల్ రన్



పంటచేనులో ఏర్పాటు చేసిన వాల్వ్



పంపుహౌస్‌లో ఏర్పాటు చేసిన మోటార్లు

తాంసి: మండలంలోని మత్తడివాగు ప్రాజెక్టు కుడి కాలువ (పైప్‌లైన్) నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. పనులు పూర్తవ్వడంతో అధికారులు ట్రయల్‌రన్ ద్వారా నీటిని పంప్‌హౌజ్ నుంచి పంపింగ్ చేస్తున్నారు. ఏడేళ్లుగా కొనసాగుతున్న పనులు చివరి దశకు చేరడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాంసి మండలంలోని వడ్డాడి సమీపంలో రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 15 ఏళ్ల క్రితం మత్తడివాగు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు సైతం పూర్తి చేసి 2008లో ప్రాజెక్టును ప్రారంభించారు. ఎడమకాలువ ద్వారా 8500 ఎకరాలకు ప్రస్తుతం సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో కుడి కాలువ నిర్మాణం పనులు చేపట్టలేదు. నూతన సాంకేతిక పద్ధతులతో పైప్‌లైన్ విధానం ద్వారా రైతులకు నీటిని అందించాలని ప్రభుత్వం కుడి కాలువ నిర్మాణానికి 2017లో రూ.7.34 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం కుడికాలువ పైప్‌లైన్, పంప్‌హౌజ్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

ఎట్టకేలకు పనులు పూర్తి..

2017లో అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీష్ రావు కుడికాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. నూతన సాంకేతిక పద్ధతులతో పైప్‌లైన్ ద్వారా నీటి వృథాను అరికట్టే విధంగా మైక్రో ఇరిగేషన్ పద్ధతిన కాలువ నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. భూగర్భ పైప్‌లైన్ ద్వారా పనులు చేపట్టారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగాయి. పంటలు వేసే సమయంలో రైతులు అడ్డుకోవడంతో జాప్యం జరిగింది. ఏడేళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు అధికారుల పర్యవేక్షణతో ఎట్టకేలకే పూర్తయ్యాయి.

పైపులైన్ ద్వారా చేలకు..

ప్రాజెక్ట్ సమీపంలో పంప్‌హౌస్‌లో 75 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మూడు మోటార్లు ఏర్పాటు చేశారు. వాటికి అవసరమైన విద్యుత్ నియంత్రిక పనులు పూర్తి చేసి కనెక్షన్ కూడా ఇచ్చారు. పంటచేన్లలో 9 కిలోమీటర్ల పొడువునా.. ప్రధాన పైప్‌లైన్ వేశారు. పైపులైన్‌కు 25 బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. బ్లాక్‌ల ద్వారా పంటచేన్లకు నీటిని మళ్లించేందుకు ఆటోమెటిక్ వాల్వ్ యంత్రాలు అమర్చారు. పంప్‌హౌస్ నుంచి ట్రయల్‌రన్ ద్వారా నీటిని విడుదల చేస్తూ లీకేజీలను పరిశీలిస్తున్నారు. త్వరలోనే కుడికాలువ ద్వారా నీటిని అధికారికంగా అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని వడ్డాడి, హస్నాపూర్, పోన్నారి, ఖోడద్ గ్రామాల శివారులో 1200 ఎకరాలకు సాగునీరు అందనుంది.

ట్రయల్ రన్ చేస్తున్నాం

మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తికావడంతో ప్రస్తుతం మోటార్ల పనితీరుతో పాటు పైప్‌లైన్ లీకేజీలను పరిశీలిస్తున్నాం. పనుల్లో ఎక్కడైనా లోపాలు ఉంటే సరిచేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. రైతులకు పైప్‌లైన్ ద్వారా పంటలు సాగు చేసుకునే విధానం, ఆటోమెటిక్ వాల్వ్‌ల గురించి అవగాహన కల్పిస్తాం.

– హరీష్ కుమార్, మత్తడివాగు ప్రాజెక్టు, ఏఈ

అటెన్షన్ ప్లీజ్.. దారి తెలిసేదెలా?



నేరడిగొండ: రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందిన కుంటాల జలపాతానికి దారి చూపే బోర్డుపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లెక్సీలు రహదారులు, గ్రామాల పేర్లు చూపే బోర్డులపై ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– అధికారి పేరు: వాహబ్ అహ్మద్, సిరిచెల్మ రేంజ్ ఆఫీసర్, ఫోన్: 94400 18890

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, నాయకులు అజయ్, జోగు మహేందర్, సాజిద్, మల్లయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని లాండసాంగ్విలో మార్కేండేయ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లాండసాంగ్వి గ్రామంలో రూ. 12 లక్షల వ్యయంతో భక్త మార్కండేయ ఆలయ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామంలో రూ. 12.60 లక్షల వ్యయంతో శ్మశాన వాటిక నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గంద్రత్ రమేశ్, బొమ్మకంటి రమేష్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, ప్రహ్లాద్, కుమ్ర రాజు, బొమ్మకంటి సత్యనారాయణ, అంకత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని గ్రామాలకు బీటీరోడ్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తలమడుగు: నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు వేయడం జరిగిందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం ఖోడద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంచాయతీలకు పక్కా భవనాలు, సీసీ రోడ్లు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మిరాజేశ్వర్, సర్పంచ్ సాకే ఆనంద్, లక్ష్మారెడ్డి, మెట్టె కిరణ్‌కుమార్, కమలాకర్, వెంకటేష్, ప్రకాశ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

బజార్‌హత్నూర్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. సోమవారం మండలంలోని హర్కాయి గ్రామంలో రూ.10 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ మారుమూల గ్రామానికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గం అధికార ప్రతినిధి మొట్టే కిరణ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు నిస్తే కైలాస్, సర్పంచ్‌లు అనంద్‌రావ్, రాంరెడ్డి, చందర్‌సింగ్, కుర్మే లక్ష్మణ్ పాల్గొన్నారు.

గోమాత సేవా ఫౌండేషన్‌కు 'గోశాల'

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని బంగారిగూడలో నిర్మించిన గోశాల నిర్వహణ బాధ్యతలను పట్టణానికి చెందిన గోమాత సేవా ఫౌండేషన్‌కు అప్పగించారు. గోశాల నిర్వహణ కోసం ఇటీవల స్వచ్ఛంద సంస్థల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో గోమాత సేవా ఫౌండేషన్‌ను ఎంపిక చేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కిషన్, మున్సిపల్ కమిషనర్ శైలజ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్తర్వులు అందజేశారు.

కార్యవర్గం ఎన్నిక

నేరడిగొండ: ఓసీ సంఘాల నేరడిగొండ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జనగం సంతోశ్, క్యాతం శివప్రసాద్‌రెడ్డిలు తెలిపారు. అధ్యక్షుడిగా బాడాలా శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సామ విద్యాసాగర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎల్చుకి శ్రావణ్‌కుమార్ జోషిలను నియమించినట్లు పేర్కొన్నారు. ఓసీ సంఘాల ఐక్యత, హక్కుల సాధన కోసం పాటు పాడాలన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్ మంజుల

ఆదిలాబాద్‌టౌన్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ ఆదిలాబాద్‌అర్బన్ సీడీపీవో వనజా అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం 1లో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ముందుగా గర్భిణులకు చీరలు, గాజులు అందజేసి సీమంతం జరిపారు. గర్భం దాల్చిన వెంటనే అంగన్‌వాడీలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ టీచర్ రాధ, రక్షిత, వందన, శాంత, అక్తరి, రబ్బాని, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్దిదారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం నిర్వహించడం జరుగుతుందని సూపర్‌వైజర్ మంజుల అన్నారు. సోమవారం మండలంలోని రాజులతండా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించి చీరలు, గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జగదీశ్వర్, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

ఆదిలాబాద్‌రూరల్: కుమ్మరుల ఆడపడుచు ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలను సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మరి కులంలో విశిష్టత కలిగిన నలుగురు మహిళలను సన్మానించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. మొల్లమాంబ వంటి తొలి తెలుగు కవిత్రిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సర్సా గౌడ్, అంజయ్ కుమార్, మ్యాకల అశోక్, దాముక రవీందర్, మోహన్ బాబు, సూటింకి సత్యనారాయణ, గణపతి, కొండపర్తి అశోక్ పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ

తాంసి: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒకరూ సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సూచించారు. సోమవారం మండలంలోని పొన్నారిలో పంచాయతీ కార్యాలయంలో కంటివెలుగు శిబిరాన్ని వైస్ ఎంపీపీ రేఖతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్యలు ఉంటే కళ్లద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, మండల వైద్యాధికారి శ్రావ్య, ఉప సర్పంచ్ అశోక్, శ్రీధర్‌రెడ్డి, అరుణ్, కృష్ణ, వైద్యసిబ్బంది సుగుణ, నగేష్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ ఇంద్రశేఖర్, ఎస్సై కృష్ణకుమార్ ప్రారంభించారు. ఈ శిబిరం 17రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్, వైద్యాధికారి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ ఎంపీపీ జైవంత్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని తాండ్ర గ్రామంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కంటి పరీక్షలతో పాటు కళ్లద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చికిత్సం కోత్మబాయి విశ్వనాథ్, డాక్టర్ సందీప్, శ్రీరామ్, హెల్త్ అసిస్టెంట్, గ్రామ కార్యదర్శి సీతారాం, గేడం ఈశ్వర్, భీంరావు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పకడ్బందీగా చేపట్టాలి



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఉపాధిహామీ పనులు, ఖర్చులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీని పకడ్బందీగా చేపట్టాలని అదనపు డీఆర్‌డీవో రవీందర్ అన్నారు. 2019 డిసెంబర్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై కేస్లాపూర్, ఏమాయికుంట, ముత్నూర్, ఈశ్వర్‌నగర్, వాల్గొండ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. సోమవారం పనుల వివరాలు, ఖర్చుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతీ గ్రామంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన పనుల వివరాలు, అక్రమాలను బయట పెట్టాలన్నారు. అవినీతికి పాల్పడిన ప్రతిఒక్కరిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాస్, సర్పంచ్‌లు మెస్రం రేణుక నాగ్‌నాథ్, తుమ్రం బాగుబాయి, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్సీకి సన్మానం

నేరడిగొండ: నేరడిగొండ మండల కేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్సీ దండే విఠల్‌ను జెడ్పీటీసీ అనిల్ జాదవ్ ఘనంగా సన్మానించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్, శాంతపూర్ సర్పంచ్ తిరుమల్ గౌడ్, భీంపూర్ జెడ్పీటీసీ సుధాకర్ పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: ఇటీవల పితృవియోగం చెందిన నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్ కొరిపెల్లి విజయలక్ష్మి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ దండే విఠల్ పరామర్శించారు. సోమవారం మండలంలోని తర్నం గ్రామంలో వారి నివాసానికి జెడ్పీటీసీ అనిల్ జాదవ్‌తో కలిసి చేరుకున్నారు. విజయలక్ష్మితో పాటు ఆమె భర్త రాంకిషన్ రెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శించారు.

జైనథ్: మండలంలోని పెండల్‌వాడ గ్రామానికి చెందిన సామ గంగారెడ్డి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే జోగు రామన్న సోమవారం పరామర్శించారు. ఇటీవలే గంగారెడ్డి తల్లి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురైన విజయ్, రాజులను సైతం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, తుమ్మల వెంకట్ రెడ్డి, పోతారెడ్డి, దశరథ్ రాంరెడ్డి ఉన్నారు.

సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

బేల: దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సంఘం మండల అధ్యక్షుడు ఆత్రం సంతోష్, ఉపాధ్యక్షుడు బోనిగిరి రవీంద్ర సోమవారం మండల తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాత్లే భీంరావు, సభ్యులు కాంబ్లే అజయ్, అముల్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేత

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయానికి విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు ధవలే శివాజీ ఆధ్వర్యంలో అందించిన పుస్తకాలను సోమవారం ఎన్‌లైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ కదం ఉన్నతి చేతుల మీదుగా గ్రంథాలయ అధికారి కాంబ్లే వెంకటికి అందజేశారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా గజానన్

తాంసి: భీంపూర్ బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా కరంజి(టి) గ్రామానికి చెందిన గజానన్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. సోమవారం కరంజి గ్రామంలో జరిగిన బీజేపీ సమావేశంలో మండల అధ్యక్షుడు జజ్జరి రాకేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. వారి వెంట నాయకులు దేవారెడ్డి, రెడ్డి రమేశ్, అశోక్, ప్రకాష్ ఉన్నారు.

పాఠశాలకు విరాళం

తలమడుగు: మండలంలోని పల్లి(బి) జెడ్పీ పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన నల్ల నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుమార్తె దీపికరెడ్డి లక్ష రూపాయల చెక్కు అందజేశారు. ప్యాన్లు, టేబుళ్లు, సామగ్రి కొనుగోలు కోసం వాళ్ల అమ్మ పద్మరెడ్డి చేతుల మీదుగా సోమవారం పాఠశాల హెచ్‌ఎం బుద్ధప్రకాష్, ఉపాధ్యాయులకు అందజేశారు.

ధ్యాన మందిర్ వార్షికోత్సవం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని శ్రీశ్రీసంత్ సద్గురు పులాజీబాబా ధ్యాన్ మందిర్ 17వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. మంగళవారం ఆధ్యాత్మిక ప్రవచలను బోధించడం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో కమిటీ అధ్యక్షులు మాదవ్ డాకురే, రాందాస్ డాకురే, కరడే మారుతి, బక్కన్న పాల్గొన్నారు.

బాలకేంద్రం చిన్నారి ప్రతిభ

ఆదిలాబాద్: స్వామి వివేకానంద ఫౌండేషన్, కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించిన ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీల్లో బాలకేంద్రం చిన్నారి ఆర్తి తృతీయ స్థానంలో నిలిచింది. బ్రహ్మాంజలి గీతంపై కూచిపూడి నృత్య విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు బాలకేంద్రం సూపరింటెండెంట్ మిట్టు రవి తెలిపారు.

డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు అభినందనీయం

ఆదిలాబాద్: దేశ సేవ చేయాలనే నిరుపేద యువత ఆర్మీ ఉద్యోగం సాధించేలా జిల్లా కేంద్రంలోనే డిఫెన్స్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమని విజయ డైరీ రాష్ట్ర మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి, ఆదిలాబాద్ మాజీ ఎంపీ గొడం నగేశ్ అన్నారు. పట్టణంలోని రణదీవేనగర్ కాలనీలో సిద్ధం చేస్తున్న శిక్షణ మైదానాన్ని సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ కల్పన

తలమడుగు: ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన అన్నారు. సోమవారం మండలంలోని లింగిలో కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రజల వద్దకే ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ ప్రజలకు అందిస్తున్న రాయితీల గురించి వివరించారు. కార్గో సేవలకు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ తన్వీర్, యూసుఫ్, రమాకాంత్, ఎస్‌వో సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ

ఉట్నూర్‌రూరల్: ప్రతీ రోజు ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందని ఉట్నూర్ డిపో ఇన్‌చార్జి జనార్ధన్ అన్నారు. ఆర్టీసీ ఎండీ, డీఎం కల్పన ఆదేశాల మేరకు సోమవారం నుంచి ఉద్యోగులందరికీ మజ్జిగ ప్యాకెట్లు అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిపో కంట్రోలర్ రామకృష్ణ, విజిలెన్స్ అధికారి పర్వేజ్, జీకే మూర్తి పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న డీఐఓ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్‌సీడీ, మాతా శిశు మరణాలు తగ్గించడం, ఇమ్యూనైజేషన్ వంద శాతం జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వైసీ శ్రీనివాస్, మాతా శిశు సంక్షేమ అధికారి విజయసారధి, జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీధర్, డీపీఎంవో అనిల్, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.